
నందివెలుగు వద్ద నీటిలో పంట పొలాలు


కొల్లిపర -చివలూరు మధ్య వరి చేలల్లో నిలిచిన నీరు


కొల్లిపరలో చెరువులను తలపిస్తున్న పొలాలు

క్లుప్తంగా

ముంపు ప్రాంతాల్లో తహసీల్దార్ పర్యటన



తెనాలి రూరల్: భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరడం, చెరువులు నిండి ప్రమాదకర స్థితికి చేరుకుంటున్న నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మండలంలో బుధవారం పర్యటించారు. మండలంలోని కొలకలూరు, బుర్రిపాలెం, కఠెవరం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలను ఎంపీడీవో అత్తోట దీప్తితో కలసి పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన వారికి వైద్య సహాయం అందేలా చూడాలని చెప్పారు.

కొల్లిపర ఇన్‌చార్జి ఎంఈఓగా వెంకటేశ్వర్లు



కొల్లిపర: మండల ఎంఈవోగా విధులు నిర్వహించిన సాల్మాన్‌రాజ్ ఉద్యోగ విమరణ చేయడంతో వేమూరు మండల ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న ఐ.వెంకటేశ్వర్లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ కార్యదర్శి టి.మల్లేశ్వరరావు, సభ్యులు వరప్రతాప్‌కుమార్, కాలేషావలి, సుగుణకుమారి, మరియదాసు, మృత్యుంజయరావు, సత్తార్, మోయనుల్లాతో పాటు పలువురు ఉపాధ్యాయలు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరం



తెనాలి అర్బన్: క్షయవ్యాధిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నందులపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. నందులపేటలోని నైట్ షెల్టర్‌లో బుధవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి నోటి తుంపర్ల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందని తెలిపారు. షుగర్ వ్యాధి ఉన్న వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల క్షయ వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. వ్యాధి లక్షణాలు కన్పిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మందులు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. సూపర్‌వైజర్ రవికుమార్, హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన మహిళా ఉద్యోగి నిరాహార దీక్ష



తెనాలి రూరల్: స్థానిక టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ తెనాలి టెలికాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె. పద్మావతి చేపట్టిన నిరసన బుధవారం మూడో రోజుకు చేరింది. పద్మావతితో దీక్షను విరమింపజేసి గుంటూరు తీసుకెళ్లేందుకు బీఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయం నుంచి కొందరు మహిళా ఉద్యోగులు తెనాలి వచ్చారు. జీఎం ఆదేశాల మేరకు వచ్చామని, దీక్ష విరమించి తమతో వచ్చి ఆయనతో మాట్లాడాలని విజ్ఞప్తి చేసినా పద్మావతి నిరాకరించి దీక్షను కొనసాగించారు. కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడాన్ని వెనక్కు తీసుకునే వరకు దీక్ష కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

రైతులు సత్వరం చర్యలు తీసుకోవాలి

తెనాలి టౌన్: భారీ వర్షానికి మెట్ట చేలల్లో నీరు నిలిస్తే ఉద్యాన పంటలను రక్షించుకోవటానికి రైతులు సత్వరం చర్యలు తీసుకోవాలని తెనాలి ఉద్యాన శాఖ అధికారి యు.శ్రీనిత్య బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అరటి, పసుపు, కూరగాయలు తదితర పంట చేలల్లో అదనపు నీటిని బయటకు పంపేయాలని సూచించారు. ఈదురు గాలులకు ఎక్కడైనా విరిగిపోయిన అరటి తోటల్లో గెలలను వెంటనే కోసి మార్కెట్‌కు పంపాలని తెలిపారు. అరటి పంటను కాపాడుకునేందుకు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పసుపు చేలల్లో వర్షాలు ఆగిన వెంటనే పంటపై లీటరు నీటికి 5 గ్రా.పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. సందేహాలకు ఉద్యాన అధికారిని సంప్రదించాలన్నారు.

భారీ వర్షం.. అన్నదాతల ఆక్రోశం

- నిండా మునిగిన వరి చేలు
- వెద పెట్టిన చేలల్లో భారీ నష్టం
- మాగాణి రైతుకు దెబ్బమీద దెబ్బ
- జూలైలో వర్షాలకు వెదపెట్టిన చేలకు నష్టం
- రెండోసారి వెదజల్లిన రైతన్నలు
- మళ్లీ ఇప్పుడు చేలల్లో వర్షపు నీరు
- ఈసారి కూడా దెబ్బతింటే భారీ నష్టం


తూములూరులో నీట మునిగిన వరి

తెనాలి: క్రమం తప్పిన వర్షాలు మాగాణి రైతులను ఆక్రోశానికి గురి చేస్తున్నాయి. ఖరీఫ్ సీజనులో అదునులో రానేలేదు. ఏదోలా నీటి వసతి చూసుకుని వెదజల్లిన రైతులకు జులైలో కురిసిన వర్షాలు దెబ్బ తీశాయి. పల్లపు చేలల్లో వరి పైరు ఉసురు తీశాయి. చేసేదిలేక రెండోసారి వెద జల్లిన రైతులకు భారీ నష్టం చేకూరుస్తూ మంగళవారం రాత్రి కురిసిన వర్షం నిద్ర లేకుండా చేసింది. తెల్లవారేసరికి వేలాది ఎకరాల్లో పంట చేలు నిండుకుండల్లా నీటితో దర్శనమిచ్చాయి. సకాలంలో నీరు బయటకు పోకుంటే ఎకరాకు రూ.10 వేలకుపైగా అన్నదాతలు నష్టపోయే ప్రమాదం పొంచిఉంది.


తెనాలి పట్టణంలో జలమయమైన రోడ్డు

17.8 సెంటీమీటర్ల వర్షం నమోదు

తెనాలిలో బుధవారం ఉదయానికి 17.8 సెంటీమీటర్ల భారీ వర్షం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పంట చేలల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. మరోవైపు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వకు ఏడు వేల క్యూసెక్కులకు పైగా నీరు విడుదల చేస్తున్నారు. భారీ వర్షాలకు కాల్వలకు నీటి సరఫరా ఆపివేసినప్పటికీ వరదనీరు పంట కాల్వలకు పోటెత్తుతోంది. దీంతో పంట చేలల్లో నిలిచిన వర్షపునీరు బయటకు పోయేందుకు సమయం పట్టేలా ఉంది. కొన్నిచోట్ల రైతులే దారులు చేసుకుంటూ కనిపించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం బుధ, గురువారాల్లోనూ వర్షాలకు అవకాశం ఉందని తెలిసిందే. చేలల్లో నీరు బయటకు పోకుండా, వర్షాలు కొనసాగితే మాత్రం రైతులకు పంట నష్టం తప్పదని చెబుతున్నారు.

ఖరీఫ్ సీజనులో తెనాలి ప్రాంతంలోని మాగాణి భూముల్లో వరి సాగుకు అత్యధిక శాతం రైతులు వెద పద్ధతిని అనుసరిస్తున్న విషయం తెలిసిందే. సీజను ఆరంభంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనటం, జలాశయాల్లో నీరు లేకపోవటంతో ఖరీఫ్ వరి సాగు ఆలస్యం అనివార్యమైంది. కాల్వలు, కుంటల్లో నీరు అందుబాటులో ఉన్న రైతులు ఆయిల్ ఇంజిన్లతో నీరు తీసుకున్నారు. సీజను మరీ ఆలస్యం కాకుండా మాగాణిలో దుక్కులు దున్ని, వరి విత్తనాలను వెదజల్లారు. దుక్కులు, విత్తనాలకు, కలుపుమందు, కొన్నిచోట్ల ఎరువుల కోసమని రైతులు అప్పటికే ఎకరాకు రూ.5 వేల చొప్పున ఖర్చు చేశారు. గత జులై నెలలో కురిసిన వర్షాలకు అప్పుడే మొలకలొచ్చిన వరి చేలల్లో పంట దెబ్బతింది. విధిలేని స్థితిలో మళ్లీ వెద జల్లాల్సిన పరిస్థితి. ఆయా చేలల్లో మరో రూ.5 వేల వ్యయంతో రెండోసారి వెదజల్లారు. ఖర్చుల సంగతి ఎలాగున్నా పెరుగుతున్న పైరు రైతుల కష్టాన్ని మరిపించింది. కురిసిన భారీ వర్షం రైతుల ఆశలను వమ్ము చేసింది.

12 వేల ఎకరాలు మునక

నియోజకవర్గంలో అన్నిచోట్లా వరిపైరు 30–40 రోజుల దశలో ఉంది. ఈ తరుణంలో కురిసిన భారీ వర్షంతో దాదాపు 12 వేల ఎకరాల్లో వర్షపు నీరు నిలిచింది. తెనాలి రూరల్ మండలంలో 17 వేల ఎకరాలకు గాను, కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట, నందివెలుగు, కఠెవరం, కంచర్లపాలెం, అంగలకుదురు, సంగం జాగర్లమూడి గ్రామాల్లోని దాదాపు 10 వేల ఎకరాలు వర్షపునీటి ముంపునకు గురయ్యాయి. కొల్లిపర మండలంలోని 20 గ్రామాల పరిధిలో 5,450 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, భారీ వర్షానికి రెండు వేలకు పైగా ఎకరాల్లో పైరు పూర్తిగా నీట మునిగింది. మరో రెండురోజులు ఇలాగే వర్షాలు కురిస్తే పంట దెబ్బతినే ప్రమాదముంది. అయితే, బుధవారం పగలు వర్షం కురవకపోవటంతో వరద నీరు చేలనుంచి బయటకు వెళుతోంది. కనీసం మరో 24 గంటల వరకైనా వర్షం కురవకపోతే ఒడ్డున పడతామని అన్నదాతలు భావిస్తున్నారు.

మునిగిన పంటలు... రైతన్న కంట కన్నీళ్లు

కొల్లిపర: మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పంటలు నీటమునిగాయి. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. జనజీవనానికి అంతరాయం కలిగింది. రోడ్లన్నీ వర్షం నీటితో మునిగిపోయాయి. మురుగు కాల్వలో నీరు పారుదల లేక పోవటంతో గ్రామాల్లో రోడ్లపైకి నీరు చేరింది. వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. మరో రెండు రోజులు ఇదే విధంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటనతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలంలో నీరు బయటక పోవటానికి వీల్లేక వరి మొక్క కుళ్లి పోయే పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా 5450 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇందులో 2వేల ఎకరాలో వరి పంట పూర్తిగా నీట మునిగింది. వరి, అరటి, పసుపు ,కూరగాయలు పంటలో వర్షం నీరు నిల్వ లేకుండా సరైన జాగ్రత్తలు పాటించాలని, నీరు బయటకు పోవటానికి దారులు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తెనాలిలో ఎడతెరిపిలేని వర్షం

తెనాలి అర్బన్: అల్పపీడనం ప్రభావం తెనాలిపై పడింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కుండపోత వర్షం కురుస్తూనే ఉంది. దీనికి ఈదురు గాలులు తోడవ్వడంతో ప్రజలు భయాందోళనకు గురి అయ్యారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం పడలేదు. సాయంత్రం నుంచి మరలా చిరుజల్లులతో పడుతూ వచ్చింది. అయితే, మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని దాదాపు అన్ని రహదారులు నీటితో నిండిపోయాయి. మారీసుపేట, నందుపేట, ఐతానగర్, చినరావూరు. యడ్లలింగయ్య కాలనీ, బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, చెంచుపేట, ఇందిరానగర్ కాలనీ, ఉడా కాలనీ, పూలే కాలనీ తదితర ప్రాంతాల్లో పలు రోడ్లు పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయాయి. బోసు రోడ్డు, గాంధీ చౌక్, వాహబ్ రోడ్డు, మారీసుపేట ఎస్‌సీఆర్ స్కూల్ రోడ్డు, బుర్రిపాలెం రోడ్డు, ఐతానగర్ ప్రధాన రహదారులు తటాకంలా మారాయి. బస్టాండ్, నాజరుపేటలోని లూథరన్ స్కూల్ ఆవరణలు జలమయం అయ్యాయి. దీంతో బుధవారం కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. సాయంత్రం నుంచి వర్షం కురుస్తుండటంతో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అల్పపీడనం ప్రభావం మరో మూడు రోజులు ఉండొచ్చని అధికారులు ప్రకటించటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.


కఠెవరం వద్ద కనుచూపు మేర చెరువులుగా పంట పొలాలు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివ సాంబిరెడ్డి

తెనాలి: భారీ వర్షం కారణంగా నష్టపోయిన వరి మాగాణిలకు రూ.10వేల నష్టపరిహారంతో పాటు విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందజేసి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులతో కలిసి బుధవారం ఆయన పట్టణ అయితానగర్, గోలి డొంక, తేలప్రోలు, నేలపాడు గ్రామాల్లోని పంట పొలాలను సందర్శించారు. మోకాలి లోతులో మునిగిపోయిన పంట చేలల్లో దిగారు. కనీసం వరి పైరు చివర్లు కూడా కనిపించక, నీరు ఎప్పటికి పోతుందో అర్థంకాక, రైతులు ఆందోళనతో ఉన్నారు. అందరూ కలిసి మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, తమ డిమాండ్లతో వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం విజ్ఞప్తితో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆయా పంట పొలాలను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మేకల ప్రసాద్, కన్నెగంటి శంకర్‌రావు, మేకల పెద వెంకటరత్నం, ఈదర ధనుంజయ్ మాట్లాడుతూ వర్షాల కారణంగా ఇప్పటికి మూడుసార్లు వెదజల్లామని చెప్పారు. ఎకరాకు రూ.15–18 వేల వరకు ఖర్చయిందని తెలిపారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా తిరిగి నాలుగోసారి వెద పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. అందుబాటులో విత్తనాలు లేనందున ప్రభుత్వమే తక్కువ వ్యవధి వరి విత్తనాలు, ఎరువులను అందించాలని ఆయయన కోరారు. కౌలే రైతులు లంకా రత్నం, శవనం కోటిరెడ్డి మాట్లాడుతూ మాగాణి కౌలు ఎకరాకు 18 బస్తాల నుంచి 25 బస్తాల వరకు ఉందని గుర్తుచేశారు. కౌలు రూ.25 నుంచి 30 వేల వరకు ఉందన్నారు. బయట వ్యక్తుల వద్ద రూ.2–3లకు వడ్డీలకు తెచ్చి పంట సాగు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ములకా శివ సాంబిరెడి విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం కూడా భారీ వర్షాలకు అన్నదాతలు నష్టపోయారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు లేకపోవడం, ఒకవేళ ఉన్నాగాని బ్యాంకు రుణాలు లభ్యం కాకపోవటంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేసి నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే సీసీఆర్సీ కార్డులు ఇచ్చి ఈ క్రాప్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దేశబోయిన శ్రీనివాసరావు, ఆర్య ప్రసాదు, వేజెండ్ల లోకయ్య, కన్నెగంటి శేషసాయికృష్ణ పాల్గొన్నారు.


తెనాలిలో కురుస్తున్న భారీ వర్షం

భారీ వర్షానికి విరిగిపడిన విద్యుత్ స్తంభాలు


సంగం జాగర్లమూడిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

తెనాలి: జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పలుచోట్ల రాత్రి తొమ్మిది గంటల్నుంచి ఉదయం ఏడు గంటల వరకు సరఫరా నిలిచి పోయింది. భారీ వర్షానికి వివిధ ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఫ్యూజులు పోవటం వంటి కారణాలతో సరఫరాకు అవరోధం ఏర్పడింది. రూరల్ మండలం కొలకలూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు మరమ్మతులకు గురైంది. సంగంజాగర్లమూడిలో రెండు, స్థానిక వైకుంఠపురం దేవస్థానం సమీపంలో మరో రెండు విద్యుత్ స్తంభాలు నేలకూలాగా, పట్టణ ఉప్పుబజారులో మరో విద్యుత్ స్తంభం దెబ్బతింది. విద్యుత్ శాఖకు తెనాలిలో రూ.3 లక్షల వరకు నష్టం కలిగిందని డీఈఈ బోరుగడ్డ అశోక్‌కుమార్ వెల్లడించారు. ఆయా విద్యుత్ స్తంభాలు పునరుద్ధరిస్తూ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను చేపట్టినట్టు చెప్పారు.

పట్టణంలో రోడ్ల నిర్మాణాలకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి అర్బన్: పట్టణంలో పలు సీసీ రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 3,20,26 వార్డుల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, కల్వర్టుకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ నిధులతో పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. 3వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలు, 20వ వార్డు సీసీ రోడ్డు రూ.38లక్షలు, 8, 26వ వార్డులో కల్వర్టును రూ.16లక్షలతో నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్, షేక్ నూర్ ఇస్మాయేల్, మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు, డీఈలు శ్రీనివాసులు, శ్రీనివాసరావు, ఏఈలు సునీల్ కుమార్, సూరిబాబు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ కోటయ్య

మానవత్వం చాటుకున్న తెనాలి తహసీల్దార్

తెనాలి రూరల్: తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటికే మిత్ర బృందంతో కలసి ఎన్నో సేవా కార్యకరమాలు చేపడుతున్నారు. వసతి గృహ విద్యార్థులు, అనాథలకు అండగా ఉంటున్నారు. తాజాగా ఆయన నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలికి ఆశ్రయం కల్పించారు. రెండు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని తీసుకువచ్చి అంగలకుదురు ముక్తి ట్రైబల్ స్కూల్ సమీపంలో వదిలి వెళ్లారు. ఈ విషయం తహసీల్దార్ గోపాలకృష్ణ దృష్టికి రాగా, బుధవారం గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించేందుకు ప్రయత్నించారు. తన పేరు సరోజిని, కొల్లూరు దళితవాడ అని మాత్రమే చెప్పగలుగుతోంది మిగతా వివరాలు చెప్పలేకపోతోంది. వెంటనే జేఎంజే స్వధార్ హోం నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలలో ఆయాగా పని చేస్తోన్న అంగలకుదురుకు చెందిన వనమా నాగమణి, మరో మహిళ కొలకలూరు దీవెనమ్మల సహాయంతో వృద్ధురాలని స్వధార్ హోంకు పంపారు. హోం నిర్వాహకుల సూచనతో వృద్ధురాలిని పొన్నూరులోని శాంథోమ్ కరుణా నిలయానికి పంపారు. వృద్ధురాలిని ఎవరు వదిలి వెళ్లారో వాకబు చేసి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.


వృద్ధురాలిని ఆశ్రమానికి పంపుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవాలి

తెనాలి అర్బన్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ శాంత పేర్కొన్నారు. జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో బుధవారం మారథాన్ వాక్‌ను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశాన్ని బ్రిటిష్ వారు ఆక్రమించుకుంటే, జాతిపిత మహాత్మాగాంధీ నాయకత్వంలో ప్రజలు అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమర యోధులను స్ఫూర్తిగా తీసుకుని వారి బాటలో అంతా నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోజలిన్, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వర్షపు నీరు బయటకు పోయేందుకు చర్యలు

తెనాలి టౌన్: రూరల్ మండలం కఠెవరంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎస్సీ, బీసీ కాలనీలు జలమయమయ్యాయి. దీనితో ఆయా కాలనీలవాసులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీంతో బుధవారం గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి షేక్ గౌస్ మొహిద్దీన్‌లు ఆయా కాలనీలో పర్యటించారు. పొక్లెయిన్ తెప్పించి కాలనీల నుంచి వర్షపు నీరు బయటకు పోయేలా అవసరమైన ఏర్పాట్లు చేయించారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలతో పాటపు బ్లీచింగ్ చల్లిస్తామని వెల్లడించారు.



ఆటల పోటీల్లో తూములూరు హైస్కూలు విద్యార్థుల ప్రతిభ


కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు


జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తూములూరు(కొల్లిపర): నేషనల్ స్పోర్ట్స్ డే (ఈనెల 29) పురస్కరించుకుని 7న జిల్లాస్థాయిలో జరిగిన కబడ్డీ, ఖోఖో పోటీల్లో తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ప్రతిభ కనపరిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొల్లాటి నాగలక్ష్మి తెలిపారు. హైస్కూల్ ఆవరణలో విద్యార్థినులను ఆమె బుధవారం తోటి ఉపాధ్యాయులతో కలసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుధాశ్రీ , రసజ్ఞ, నీలిమ, శిరీష , గీతా ఏసురాణిలు జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో సత్తా చాటి జోనల్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.సాంబశివరావు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్య

జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదపరిమిలో ముప్పా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌లో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ విభాగంలో తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయురాలు కొల్లాటి నాగలక్ష్మి తెలిపారు. బాలికల విభాగంలో రసజ్ఞ(46 కేజీలు), సుధాశ్రీ(40 కేజీలు),మానస (44కేజీలు) విభాగాల్లో తృతీయ స్థానంలో నిలిచి, కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. బాలురు విభాగంలో ప్రసన్న రాజు(60కేజీలు) ఫణి (58కేజీలు), ఎం.అభిలాష్ (55 కేజీలు)లు ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించనట్లు తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. సాంబశివరావు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

అవయవదానం ఆవశ్యకతపై అవగాహన



తెనాలి: అఖిల భారత శరీర అవయవ దాన దినోత్సవం సందర్భంగా బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూలులో అవగాహన సదస్సును నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, విశిష్ట అతిథిగా వివేక విద్యాసంస్థల అధినేత రావిపాటి వీరనారాయణ, అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కల కిరణ్‌బాబు, కార్యదర్శి బొగ్గుల సాంబశివారెడ్డి, రోటరీ కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయణ అవయవదానం ఆవశ్యతపై అవగాహన కల్పించారు. 'మరణించినా జీవించండి' అనే గోడ పత్రికను ఆవిష్కరించారు. అవయవ దానం చేయటానికి ముందుకొచ్చిన వెంకట పూర్ణచంద్‌ను సత్కరించారు. సభ్యులు జి.వెంకటరత్నం,కె.మురళీకృష్ణ, చేతన్‌రాజ్ కొఠారి, కేఎల్ జగదీశ్వరాంబ, మల్లాది అర్జున్, కొల్లి రాజేంద్రప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.